## క్లుప్తంగా

### తాగునీటి సమస్య లేకుండా చర్యలు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటిపై దృష్టి సారించాలని, భగీరథ పైపులైన్లు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణ, ఎంపీఓ మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని పీడీపీఓ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్ గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య లక్ష్మి పథకంలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఒక పూట భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు రాజశేఖర్, సూపర్ వైజర్ సంతోష, పోషణ్ అభియాన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కిరణ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### డబుల్ ఇళ్ల ఎంపికపై విచారణ జరపాలి



వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికలో అనర్హులను ఎంపిక చేసిందని, అధికారులు విచారణ జరిపి వారి పట్టాలు రద్దు చేసి అర్హులైన వారికి అందజేయాలని మంగళవారం పలువురు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో 48 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ ఇళ్ల పట్టాలు అందజేసిందన్నారు. ప్రస్తుతం 15 మంది లబ్ధిదారులు మాత్రమే ఉంటున్నారని తెలిపారు. మిగతా 33 మంది లబ్ధిదారులు వారి సొంత ఇళ్లలో ఉంటున్నారన్నారు. వారిని అనర్హులుగా గుర్తించి పట్టాలు రద్దు చేసి, ఇళ్లు లేని పేదలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్ గౌడ్, నాయకులు వెంకటేశ్, మహేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

**రూ.5 లక్షలు అందజేసిన చక్రధర్ గౌడ్**

నంగునూరు(సిద్దిపేట): గౌడ సంఘం ఆధ్వర్యంలో నంగునూరులో నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం కోసం సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ మంగళవారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయాన్ని అన్ని హంగులతో నిర్మించాలని, తన వంతుగా మరింత సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు.

### నీళ్ల పంచాయితీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన నీటి విషయంలో పంచాయతీ సిబ్బంది ఇతరులకు విక్రయించడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాక్షి దినపత్రికలో నీళ్ల పంచాయితీ అనే శీర్షికతో ప్రచురితమైన వార్త కథనానికి ఎంపీవో శోభ స్పందించారు. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ బావి, పైపులైన్‌లను పరిశీలించారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

### దేశభక్తిని పెంపొందించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)ది కీలక పాత్ర అని, ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్ అన్నారు. ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంజీవని పారా మెడికల్ కళాశాలలో పేద విద్యార్థుల కోసం పాలీసెట్ ఉచిత బోధనా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విష్ణువర్ధన్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సిద్దిపేట, మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య, నగర సంఘటన మంత్రి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# బొడిగెపల్లి 'బీటీ రోడ్డు'కు మోక్షం

**రోడ్డు పనులు ప్రారంభం**

- మూడు నెలల్లో పనులు పూర్తి
- రూ.1.50 కోట్ల నిధులు మంజూరు



బొడిగెపల్లి గ్రామం మట్టిరోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నో ఏళ్లుగా గుంతలు పడి..కనీస రాకపోకలు సాగించేందుకు కూడా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల బీటీ రోడ్డు కల నెరవేరనున్నది. మండలంలోని బొడిగెపల్లి గ్రామంలో రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన బీటి రోడ్డు నిర్మాణానికి జనవరిలో మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో నాలుగు నెలల తర్వాత గుత్తేదారుడు బీటీ రోడ్డు నిర్మాణ పనులను రెండ్రోజుల కింద ప్రారంభించారు. శుక్రవారం బొడిగెపల్లి స్టేజీ నుంచి గ్రామ శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. ఈ బీటీ రోడ్డును బొడిగెపల్లి స్టేజీ నుంచి దాదాపు ఒక కిలో మీటరున్నర వరకు నిర్మిస్తారు.

**తొలగనున్న కష్టాలు**

ఈ రోడ్డు మార్గం ద్వారా బొడిగెపల్లి గ్రామస్తులతో పాటు రేగొండ, గోవర్ధనగిరి గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్డంతా గుంతలు పడి బురదమయంగా మారుతుండటంతో అటు వాహనదారులు, బాటసారులు పడరానీ కష్టాలు పడుతున్నారు. ప్రైవేట్ స్కూల్‌కు పిల్లలను పంపించాలంటే రోడ్డు మార్గం సరిగా లేక బస్సులు కూడా రాలేని దుస్థితి ఉండేది. అలాగే గోవర్ధనగిరి గ్రామ సంజీవరాయిని గుట్టపై వెలిసిన ఆంజనేయ స్వామి దేవాలయానికి, శ్రావణ మాసంలో ప్రకృతి అందాలను చూసేందుకు వచ్చే వారు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో ఏండ్లుగా బీటీ రోడ్డు కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజలు పనులు ప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మించాలని అనేకసార్లు అప్పటి ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న హామీ ఇచ్చారు తప్ప నిధులు మంజూరు చేయలేదని గ్రామస్తులు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి నిధుల మంజూరుకు కృషి చేసి బీటీ రోడ్డు నిర్మాణ కల నిజం చేస్తున్నందుకు గ్రామస్తులు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**మూడు నెలల్లో పూర్తి చేస్తాం**

ఈ బీటీ రోడ్డు నిర్మాణ పనులు సరిగ్గా మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశాం. ఆ దిశగా సదరు గుత్తేదారుడు పనులను వేగంగా చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నాం.

-వాసుదేవరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ





మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసిన బీటీ రోడ్డు శిలాఫలకం(ఫైల్)

# రోడ్డు నిర్మించాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తీగుల్ నుంచి పొలాలకు వెళ్లే దాతర్‌పల్లి వరకు రోడ్డు వేయాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు కృష్ణమూర్తి, మండల కిసాన్‌మోర్చ అధ్యక్షుడు పర్వతాలు ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావును కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతర్‌పల్లి మార్గంలో మట్టి రోడ్డు కావడం వల్ల వర్షాకాలంలో బురదమయమై పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మండల పంచాయతీరాజ్ ఏఈ, ఎంపీడీవోలతో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశం, రైతులు లక్ష్మయ్య, ఐలయ్య, మల్లయ్య, నాగేందర్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు మెప్మా తోడ్పాటు

**మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్**



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా మెప్మా తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వార్డుల్లో ఆర్పీలు క్షేత్ర స్థాయిలో ఉండాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధం కోసం మెప్మా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఎకో లాస్టిక్ కవర్‌లను వాడేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించే వారిపై జరిమానా విధించే బదులు అదే డబ్బులతో ఎకో లాస్టిక్ కవర్లు అందించాలని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో మెప్మా సిబ్బంది సంతోషి, జ్యోతి ఆర్పీలు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దుబ్బాకటౌన్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాదత్ అలీ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు హర్షవర్ధన్, కౌశిక్, సుశాంత్ ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువిక కార్యక్రమానికి ఎంపికైన నేపథ్యంలో మంగళవారం విద్యార్థులను, గైడ్, ఉపాధ్యాయురాలు జ్యోతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల పాటు ఇస్రో ఆధ్వర్యంలో ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు రాకెట్ లాంచింగ్, ఉపగ్రహ నిర్మాణం, అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

### 22 వరకు పోషణ పక్షం

దౌల్తాబాద్(దుబ్బాక): ఈ నెల 22 వరకు గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. మండలంలోని బొమ్మాట గ్రామంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఏసుమణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి భిక్షపతి పాల్గొన్నారు.

### సమగ్ర విచారణ జరిపించాలి

సిద్దిపేటజోన్: మెప్మా సిబ్బంది ఫోర్జరీ సంతకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల తొలగింపు ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజ్, విజయ్ పాల్గొన్నారు.

### బీజేపీని గద్దె దించితేనే రాజ్యాంగ పరిరక్షణ

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్రంలోని బీజేపీని గద్దె దించితేనే రాజ్యాంగ పరిరక్షణ జరుగుతుందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని బేగంపేట, ఖాజీపూర్, భూంపల్లిలో మంగళవారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కమలాకర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి వంశీచందర్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌నర్సాగౌడ్, ఉపాధ్యక్షుడు భూమయ్య, యూత్ అధ్యక్షుడు లోకేష్‌గౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు సుమలత, నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం



దుబ్బాకటౌన్: ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాకటౌన్: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని దుబ్బాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి రవి అన్నారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం సరికాదన్నారు. అనంతరం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

**దౌల్తాబాద్ మండలంలో..**

దౌల్తాబాద్ (దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కనకయ్య, ఉపాధ్యక్షుడు స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాలు, నాయకులు రమేశ్, సంపత్ రెడ్డి, కిష్టారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డి మండలంలో..**

మిరుదొడ్డి(దుబ్బాక): ముబారస్‌పూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో అంబేడ్కర్ బొమ్మ ఉన్న జెండాను నిర్లక్ష్యంగా విసిరేసి అవమానించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అలాగే తొగుట మండలంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ భూంపల్లి చౌరస్తాలో ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ స్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి కమలాకర్, శంకర్, సుమలత, శ్రీధర్, మధు, వెంకటేశం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ బిల్లుల మంజూరుకు వినతి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను త్వరగా పరిశీలన చేసి మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ కోరారు. మంగళవారం గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, అదనపు డైరెక్టర్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ బిల్లుల జాప్యం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జానకీరామ్‌రెడ్డి, వేమారెడ్డి, శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై శిక్షణ అభినందనీయం



మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్

గజ్వేల్‌రూరల్: ఇతర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠ్యాంశాలు, సామాజిక అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. మండల పరిధిలోని ముక్తమాసన్‌పల్లిలోని ఎంపీపీఎస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో ఈనెల 24 నుంచి 30 వరకు వేసవి శిక్షణ శిబిరంను నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లపై ప్రధానోపాధ్యాయులు నర్సిహులు, ఉపాధ్యాయురాలు పద్మను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు డ్రాయింగ్ షీట్స్, కలర్ పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ స్రవంతి తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బెజ్జంకి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్యాక్స్ చైర్మన్ శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ కృష్ణ

కోహెడ(హుస్నాబాద్): వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం తిరుపతిగౌడ్, సీసీ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

**బెజ్జంకి మండలంలో..**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు, గూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఫాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ కృష్ణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాయకులు, డైరెక్టర్‌లు సంతోష్, నరేష్‌బాబు, రాజు, కుమార్, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, సాధిక్, బాబు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాల పరిశీలన**

నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మహిపాల్ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ మహ్మద్ సలీమ్ నియామకం**

చిన్నకోడూరు(సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడుగా మహ్మద్ సలీమ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

**◆ ఏకరూప దుస్తులు అందజేత**

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏకరూప దుస్తులను అందజేశారు. మండల విద్యాధికారి కనకరాజు మాట్లాడుతూ.. ఈ దుస్తులను జూన్ 2వ తేదీ వరకు విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోవిందరెడ్డి, కుమార్, సీఆర్పీలు రాజు తదితరులు పాల్గొన్నారు.

**◆ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) బైరాన్ చెరువు గుట్టల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ నాయకుడు పి.రవీందర్ ఆరోపించారు. మంగళవారం మట్టి తవ్వకాలను నిలిపివేసి ప్రకృతి పర్యావరణాన్ని రక్షించాలని కోరుతూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

**◆ మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 18మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా రూ.43వేల జరిమానా విధించారు.

**◆ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన**

హుస్నాబాద్: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో అధికారులు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

**◆ మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్**

గజ్వేల్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, చేవెళ్ల కళాశాలకు చెందిన అధ్యాపకుడు నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ కస్తూరిబాయి, బాలచంద్రం, డాక్టర్ జయరాజు, సరోజన, దేవదాసు, నరేశ్, విజయ్ పాల్గొన్నారు.

**◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నిబయ్యారం గ్రామానికి చెందిన కామల్ల ఐలయ్య(40)కు భార్య లింగవ్వతో పాటు ఇద్దరు కొడుకులున్నారు.ఐలయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 8న మద్యం తాగిన మైకంలో అతడు పురుగుల మందు సేవించి వాంతులు చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబీకులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి , అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

- దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి
- రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



వర్గల్(గజ్వేల్): చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

దౌల్తాబాద్ (దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని వీఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దుబ్బాక అంటేనే ఉద్యమాల గడ్డ అని ఇక్కడ ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడుతున్నారన్నారు.ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్త హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్, శ్రీనివాస్ గౌడ్, పూజిత వెంకట్ రెడ్డి, నర్సింహులు, ఎండీ అహ్మద్, తిరుపతి, రాజేందర్, ఖలీల్, భూషణం పాల్గొన్నారు.

**బెజ్జంకి మండలంలో..**

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. బెజ్జంకి మాజీ ఎంపీపీ లింగాల నిర్మల ఇంట్లో మంగళవారం సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాజయ్య, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, బాలనర్సు, రమేశ్, ఐలయ్య, సత్యనారాయణరెడ్డి, శేఖర్‌బాబు, నరేశ్ పాల్గొన్నారు.

**మద్దూరు మండలంలో..**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ తదితర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు కనకరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేశం, నంద శ్రీను, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

**గోడ పత్రిక ఆవిష్కరణ..**

చేర్యాల(సిద్దిపేట): 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బహిరంగ సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, చంటి, తిరుపతి, రంజిత, అంజయ్య, కొండయ్య, ఆరోగ్యరెడ్డి, భిక్షపతి, శ్రీను, రాంచంద్రం, పరశరాములు, మహేందర్, సిద్ధిలింగం, భిక్షపతి, మధు, మానస, కిశోర్, బాలయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

**పాలన అవినీతి మయం**

వర్గల్(గజ్వేల్): కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి పెచ్చరిల్లుతున్నదని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన వర్గల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభ జనసమీకరణ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా ఎగవేస్తోందని ఆరోపించారు. వరంగల్ సభకు భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు రమేశ్‌గౌడ్, గణేశ్, వెంకటేశ్, జహీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ (దుబ్బాక): సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి